ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు

ఆదివారం 1 జూన్ 2025

పాలపుంత.. చిత్తూరు జిల్లా..!

వైసీపీ పాలనలో పాడి రైతులనూ కష్టపెట్టారు



● నేడు ప్రపంచ పాల దినోత్సవం

పాల ఉత్పత్తిలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో సుమారు 1,11,168 కుటుంబాలు పాడి పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. రోజుకు 18 లక్షల నుంచి 20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా.. వైసీపీ ఐదేళ్ల పాలనలో మాత్రం పాడి రైతులనూ కష్టపెట్టారు. దీనివల్ల కొందరు పాడి రైతులు తమ ఆవులను తెగనమ్ముకోవాల్సి వచ్చింది.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

జిల్లాలో 5,44,587 పశువులున్నాయి. వీటిలో పాడి ఆవులు 4,67,351, గేదెలు 1,736 ఉన్నాయి. ప్రసిద్ధి గాంచిన పుంగనూరు జాతి ఆవులతో పాటు దేశవాళీ, హలికర్, హెచ్ఎఫ్ సంకర జాతి, జెర్సీ సంకర జాతి, గిర్ జాతి ఆవులున్నాయి. దేశవాళీ గేదెలతో పాటు గ్రేడెడ్ ముర్రా, ముర్రా జాతి గేదెలున్నాయి.

పాల ఉత్పత్తి, వినియోగం

జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో (మదర్ ఏజెన్సీగా చెప్పుకునే) 'శ్రీజ' పాలసంస్థ 31 మండలాల్లో 36 బల్క్ మిల్క్ సెంటర్లు నిర్వహిస్తోంది. 27వేల మంది పాడి రైతుల నుంచి రోజుకు 1.18 లక్షల నుంచి రూ.1.64 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. వీటిలో అత్యధిక శాతం పాలు తిరుమలకు వెళుతున్నాయి. శాంతిపురం మండలం నుంచి అత్యధికంగా రోజుకు 1.20 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి కాగా, పాలసముద్రం నుంచి అత్యల్పంగా 25వేల లీటర్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇదిలా ఉండగా అమూల్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 80 సెంటర్ల నుంచి రోజుకు కేవలం 8వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఇంటి వాడకానికి 6 లక్షల నుంచి 9 లక్షల లీటర్ల వరకుపోగా, మిగిలిన పాలను ఫ్యాక్టరీల్లో పాల పదార్థాలకు తయారీలో వాడుతున్నారు.

పాలసముద్రం టూ బెంగళూరు



పాలసముద్రం మండలంలో గిర్ జాతి ఆవులు

పాలసముద్రం మండలంలో రోజువారీ పాల ఉత్పత్తి చాలా తక్కువగా ఉన్నా, ఇక్కడి పాలకు మంచి గిరాకి ఉంది. ఈ మండలంలోని పాడి రైతులు ఎక్కువగా గిర్ జాతి ఆవులను పెంచుతారు. వీటి పాలు చిక్కగా, పోషక విలువలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ మండలంలో ఉత్పత్తి అయ్యే 25వేల లీటర్లలో.. ఏకంగా 5-7వేల లీటర్లు బెంగళూరుకు తరలిపోతున్నాయి. లీటరు ధర ఏకంగా రూ.150, నెయ్యి కిలో ధర రూ.2 వేలు పలుకుతుండటం గమనార్హం.

పాడిని నాశనం చేశారిలా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలోని ప్రతి రంగాన్నీ ఛిద్రం చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. పాడి రైతులకు కూడా తీవ్ర నష్టం కలిగించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. తన కుటుంబ సభ్యులకు చెందిన శివశక్తి డెయిరీ సదుంలో ఉంటుంది. నియోజకవర్గంలోని పాడి రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ డెయిరీకే పాలను ఇవ్వాలని నియంతలా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. అలాగే చేయని రైతులకు భూ సమస్యలు సృష్టించి, సంక్షేమ పథకాలు అందకుండా చేసేవారని, బయటి ప్రాంతాల డెయిరీ వ్యానులు నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకునేవారన్న ఆరోపణలూ ఉన్నాయి. వీటితోపాటు కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు డీఆర్‌డీఏ ద్వారా సోమల, చౌడేపల్లెలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ సెంటర్లనూ వైసీపీ హయాంలో రద్దు చేశారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది పాడి రైతులు తమ ఆవుల్ని అమ్ముకున్నారు.

పూర్తిగా గాడిలో పడలేదు

కూటమి ప్రభుత్వం వచ్చాక పుంగనూరు నియోజకవర్గంలోకి మిగిలిన డెయిరీ వ్యానులు పాల సేకరణకు వెళ్తున్నాయి. పెద్దిరెడ్డికి చెందిన శివశక్తి డెయిరీ కూడా లీటరు మీద రూ.10 వరకు పెంచింది. అయినా ఇంకా గాడిలో పడలేదు. సోమల, సదుం, చౌడేపల్లె మండలాల్లో ఈ బల్క్ మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేస్తే పాడి రైతులకు మేలు జరుగుతుంది. ఇక్కడ భవనాలుండగా.. మిషనరీ ఏర్పాటు చేస్తే సరిపోతుంది.

విజయా డెయిరీని కట్టబెట్టేసి మోసం

2019కు ముందు ఎన్నికల ప్రచారాల్లో భాగంగా మాజీ సీఎం జగన్.. చిత్తూరుకు తలమానికమైన విజయా డెయిరీని పునరుద్ధరిస్తానన్నారు.. పాల ధరను పెంచి ఇన్సెంటివ్‌లు ఇస్తానని సదుంలో మాటిచ్చారు. ఏదీ నిలబెట్టుకోలేదు. పునరుద్ధరణ పక్కన పెడితే, విజయా డెయిరీని అమూల్ సంస్థకు చవకగా అప్పగించేశారు.

ప్రస్తుత ప్రభుత్వం చర్యలేవీ?

అమూల్ సంస్థ ఏర్పాటు చేసిన తొలినాళ్లలో 350 పాల సేకరణ కేంద్రాలను హంగామాగా ఏర్పాటు చేసింది. రోజుకు 65 వేల లీటర్లను సేకరించేది. కొంతకాలానికి 80 సెంటర్లకు కుదించి 8వేల లీటర్ల పాల సేకరణకు పరిమితమైంది. మిగిలిన పాలను తమిళనాడు ప్రాంతాల నుంచి సేకరిస్తున్నారు. దీంతో జిల్లాలోని పాలరైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఈ విషయంగా చర్యలు తీసుకోలేదు.



ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), మే 31 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం ఉదయం నుంచి వేల సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. దీంతో స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో పెంచలకిషోర్ చర్యలు తీసుకున్నారు.

రేపు కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని, డివిజన్ స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశాలిచ్చారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొలి రోజు 94.39 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా తొలి రోజైన శనివారం 94.39 శాతం పంపిణీ జరిగింది. 2,62,985 మందికిగాను 2,48,244 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. వివిధ కారణాలతో పంపిణీ చేయని 14,741 మంది లబ్ధిదారులకు సోమవారం అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

మొదలైన 'టెన్త్ సప్లిమెంటరీ' మూల్యాంకనం

చిత్తూరు సెంట్రల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 36 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. వీటికి సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్, ఏతః వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. వివిధ జిల్లాల నుంచి చిత్తూరు జిల్లాకు 10,300 జవాబు పత్రాలు రాగా, వీటిని మూల్యాంకనం చేయడానికి 10 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 140 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించారు. మూడు రోజుల పాటు మూల్యాంకనం జరగనుంది.

నేటినుంచి చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి చౌకదుకాణాల ద్వారా సరుకులను పంపిణీ చేయనున్నట్లు జేసీ విద్యాధరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ల ద్వారా ఆదివారాలు, సెలవు దినాలతోసహా ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకోవచ్చన్నారు. 65 ఏళ్ల, అంతకన్నా ఎక్కువ ఉన్నవారు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరుకులను డీలర్ పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

అమ్మవారికి బంగారు కాసులమాల



డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు బంగారు కాసుల మాల అందజేస్తున్న దాత కుమార్

పద్మావతి అమ్మవారికి శనివారం బెంగళూరుకు చెందిన కుమార్ 110 గ్రాముల బంగారు కాసుల మాలను కానుకగా అందజేశారు. దీనిని డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్ స్వీకరించారు. దాతకు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

● సంగీత, నృత్య, నాదస్వరం కోర్సుల్లో చేరికకు

దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం, డోలు పాఠశాలలో 2025-26విద్యా సంవత్సరానికి పలు కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్ టైమ్, విశారద(డిప్లొమా), ప్రవీణ(అడ్వాన్సు డిప్లొమా) కోర్సులున్నాయని పేర్కొంది. నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులున్నాయని, ఈనెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించింది. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టీటీడీ పేరుతో రూ.50డీడీ తీసి దరఖాస్తు పొందాలని, రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణత, సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. మరిన్ని వివరాలకు 9440793205, 9848374408లను సంప్రదించాలని కోరింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,721

తలనీలాలు సమర్పించినవారు: 36,011



తిరుపతిలోని రేషన్ దుకాణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర

ఎండీయూ వాహనం వచ్చే రోజుకోసం పని మానుకుని ఎదురు చూడాల్సిన పనిలేదు. పట్టణాల్లో వీధి చివరన.. రోడ్డు పక్కన క్యూలో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక నుంచి తొలి 15 రోజుల్లో.. మనకు వీలున్నప్పుడు వెళ్లి సరుకులు తీసుకోవచ్చు. జూన్ నుంచీ పాత పద్ధతిలో రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నేటి నుంచి షాపుల్లోనే రేషన్

● దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే

● పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లాలోని 1457 చౌక ధరల దుకాణాల్లో పాత పద్ధతిలోనే ఆదివారం నుంచి కార్డుదారులకు సరుకులు అందించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి జూన్ నెల కోటాను సంబంధించిన బియ్యం, చక్కెర, కంది పప్పు నిల్వలను రేషన్ దుకాణాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ షాపుల్లో డీలర్లు ఈ-పోస్, తూకం మిషన్లు సిద్ధం చేసుకున్నారు. ధరల పట్టిక, నిల్వ వివరాలు, రేషన్ షాపు నెంబరు ప్రదర్శించాలని ఇప్పటికే డీఎస్‌వో శేషాచలం రాజు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని ప్రజాప్రతినిధులను, వృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని అధికారులు పేర్కొన్నారు. ఇక, రేషాపుల్లో ఏర్పాట్లపై అధికారులు తనిఖీ చేస్తున్నారు. తూకం మిషన్లు పనిచేయని చోట తక్షణం కొత్తవి కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలన్నారు. ఇక తాగు నీరు, కూర్చోవడానికి బెంచీలు లేదా కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ప్రతి రేషన్ షాపులో రెండు ఫ్యాన్ల ఏర్పాటుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వీళ్లకు.. ఇళ్ల వద్దకు

65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి తీసుకెళ్లి సరుకులు ఇవ్వనున్నారు. వీరందరినీ వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాలి. వీరికి 5వ తేది వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరుకులు అందించేలా ఏర్పాట్లు చేయాలి.

రేషన్ షాపుల పనివేళలు

ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు సరుకులు ఇవ్వాలి. ఈ రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలి. ఏ చౌక ధర దుకాణం నుంచైనా వారికి అవసరమైన సరుకులు పొందవచ్చును.





అలిపిరి చెక్‌పాయింట్‌లో కార్ల బారులు.. క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య

● కొండపై సమ్మర్ ఎఫెక్ట్

కిటకిటలాడుతున్న తిరుమల

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలువులు చివరిదశలో ఉండటంతో పాటు వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఈక్రమంలో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం తరహాలోనే శనివారం కూడా క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు సర్వదర్శన భక్తుల క్యూ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకూ 3 గంటల దర్శన సమయం పడుతోంది. పెరిగిన రద్దీ నేపథ్యంలో శ్రీవారి ఆలయం, మాడవీధులు, అన్నప్రసాదకేంద్రం, వరాహస్వామి విశ్రాంతి గృహాల సర్కిల్, రాంభగీచా, లేపాక్షి కూడళ్లు, బస్టాండ్, యాత్రికుల వసతి సముదాయాలు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ వంటి ప్రాంతాల్లో యాత్రికులు కిక్కిరిసిపోయారు.



జేఈవో ఆఫీసు నుంచి నారాయణగిరి గెస్ట్‌హౌస్ దారిలో..

బారులు తీరుతున్న కార్లు

కొవిడ్ తర్వాత తిరుమలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే సొంతవాహనాల్లో ఎక్కువ మంది భక్తులు వస్తున్నారు. దీంతో తిరుమలలో కార్లు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం కూడా అలిపిరి చెక్‌పాయింట్ వాహనాలతో రద్దీగా మారింది. గరుడసర్కిల్ ఆర్చ్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వీఐపీ, సర్వీసు లైన్లతో పాటు ద్విచక్రవాహనాలను అనుమతించే మార్గంలోనూ కార్లను అనుమతించారు. ఇక, తిరుమలలోనూ పార్కింగ్ ప్రాంతాలు నిండిపోవడంతో రోడ్లపైనే భక్తులు వాహనాలను పెట్టి దర్శనానికి వెళ్లిపోతున్నారు. దీంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య నెలకొంది.



అన్నదానం కాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్‌ల నుంచి

29 పోస్టులు ఔట్

● ఇతర జిల్లాలకు 8 బోధన.. 21 బోధనేతర సిబ్బంది బదిలీ ● బయటి నుంచీ 5 పోస్టుల రాక

● జిల్లాలోనే ఏడు సర్దుబాటు

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు 8 టీచింగ్, 21 నాన్ టీచింగ్ పోస్టులు కోల్పోయాయి. ఈ 29 పోస్టులను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2008లో పాక్షిక పోస్టులతో మంజూరైన.. 2014-15లో పోస్టులే లేకుండా ఏర్పాటైన పాలిటెక్నిక్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు సరిపడా లేక నిర్వహణ కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత పాలిటెక్నిక్‌ల నుంచీ కొన్ని పోస్టులను అవసరమైన చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా టీచింగ్ పోస్టులలో.. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ నుంచీ తాడిపత్రికి.. పుత్తూరు మండలం పిళ్ళారిపట్టు పాలిటెక్నిక్ నుంచీ నెల్లూరుకు, కడప జిల్లా సింహాద్రిపురానికి ఒక్కోటి చొప్పున.. గూడూరు పాలిటెక్నిక్ నుంచి ఈతముక్కల బాలికల పాలిటెక్నిక్‌కు, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు ఒక్కోటి వంతున పోస్టులు బదిలీ అయ్యాయి. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ కళ్యాణదుర్గానికి, మదనపల్లె మోడల్ నుంచి కళ్యాణదుర్గానికి, గుంటూరు మైనారిటీ పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున మూడు పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక నాన్ టీచింగ్ పోస్టుల విషయానికొస్తే గూడూరు సిరామిక్ టెక్నాలజీ సంస్థ నుంచీ తొమ్మిది, పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ ఎనిమిది, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్ నుంచీ మూడు, గూడూరు పాలిటెక్నిక్ నుంచీ ఒకటి చొప్పున మొత్తం 21 నాన్ టీచింగ్ పోస్టులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యాయి.

● నంద్యాల పాలిటెక్నిక్ నుంచీ తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు ఒకటి, కళ్యాణ దుర్గం నుంచీ పలమనేరు బాలికల పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున రెండు టీచింగ్ పోస్టులు బదిలీ అయ్యాయి. అలాగే శ్రీశైలం, కర్నూలు, నంద్యాల పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున మూడు నాన్ టీచింగ్ పోస్టులు సత్యవేడు పాలిటెక్నిక్‌కు వచ్చాయి.

● తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోనే ఒక పాలిటెక్నిక్ నుంచీ మరో పాలిటెక్నిక్‌కు 8 టీచింగ్ పోస్టులను సర్దుబాటు చేశారు. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ మూడు, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్, కలికిరి, పిళ్ళారిపట్టు, చంద్రగిరి పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున ఏడు టీచింగ్ పోస్టులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు బదిలీ చేశారు.

నేడు కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు

● నిమిషం ఆలస్యమైనా లోపలకు నో ఎంట్రీ

● అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్



తిరుపతిలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం కానిస్టేబుళ్ల ఎంపికకు రాత జరగనుంది. ఈ పరీక్షకు 5207 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే రాత పరీక్షకు నిమిషం ఆలస్యమైన లోపలకి అనుమతి లేదని అదనపు ఎస్పీ, పరీక్షల నోడల్ అధికారి రవిమనోహరాచ్చారి ప్రకటించారు. అభ్యర్థులందరూ గంటన్నర ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ బయోమెట్రిక్ వద్ద వేలి ముద్ర వేసి లోపలికి వెళ్ళి ఆయా కేంద్రాల వద్ద పరీక్షలు రాయాలన్నారు. తిరుపతిలో ఏడు, రేణిగుంటలో ఒకటి, తిరుచానూరులో ఒకటి వంతున కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద సీఐ, ఎస్ఐలు, నలుగురు కానిస్టేబుళ్ళు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళను, ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌ను నియమించారు. డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల లోపు వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు, బుక్ షాపులు, ఇతర దుకాణాలు తెరచి వుండకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక పెన్, పరీక్ష ప్యాడ్ మాత్రమే తీసుకెళ్లొచ్చన్నారు. తిరుపతిలోని పరీక్షా కేంద్రాలను శనివారం డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్

పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షల నేపథ్యంలో జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వచ్చేనెల 30వ తేది వరకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నా కార్యక్రమాల నిర్వహించరాదని తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

గుంతకల్లు వరకు పొడిగింపు

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522)ను సోమవారం నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522)గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది.

ఏక్ నిరంజన్.. శ్యాంప్సన్

● 20 ఏళ్లక్రితం నైజీరియా నుంచి తిరుపతికి

● ఎస్వీయూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి

● అనారోగ్యంతో మృతి చెంది అనాథగా అంత్యక్రియలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

నైజీరియాకు చెందిన ఎస్వీయూ పరిశోధక విద్యార్థి శ్యాంప్సన్ ఓకాన్ (65)నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో శనివారం సాయంత్రం జీవకోనలోని శ్మశానవాటికలో క్రైస్తవ మత ఆచారంతో పోలీసులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎవరీ శ్యాంప్సన్

నైజీరియా దేశాన్ని ఎందుకు విడిచిపెట్టారో తెలియదు. ఇరవై ఏళ్ల క్రితమే ఇండియాకి వచ్చారు. తిరుపతికి చేరుకుని సుమారు తన 45 ఏళ్ల వయస్సులో ఎస్వీఎస్ కాలేజీలో డిగ్రీలో చేరారు. డిగ్రీ పూర్తయిన తర్వాత (2003-06) ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో పీజీలో చేరారు. 2006-08 పీజీ తర్వాత రెండేళ్ల విరామం అనంతరం ప్రొఫెసర్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో (2010) పీహెచ్‌డీ చేరి 2019లో డాక్టరేట్ పొందారు. డిగ్రీ, పీజీ చదువుకునే సమయంలో వెస్ట్ చర్చి వద్ద ఎస్‌ఏఎల్సీ ఆధ్వర్యంలో ఉండే క్రిస్టియన్ హాస్టల్ (ప్రస్తుత కలెక్టర్ నివాసం పక్కన)లో ఉండేవారు. 2017లో ఎల్బీనగర్‌లోని ఓ చర్చిలో రేకుల గదిలో అద్దెకు చేరారు. ఏప్రిల్ 27న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి యజమాని టీపీ మధుకుమార్ చూస్తే అస్వస్థతతో కనిపించారు. 108కు సమాచారమిచ్చి రుయాస్పత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్సపొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతిచెందారు.



శ్యాంప్సన్ మృతదేహం

35 రోజులగా మార్చురీలో..

ఇంటి యజమాని మధు కుమార్ ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో శ్యాంప్సన్ వీసా (పాస్‌పోర్ట్ నెంబరు -ఏ౭312988) గడవు ముగిసినట్టు గుర్తించారు. ఆయన మృతిచెందినట్టు న్యూఢిల్లీలోని నైజీరియా హైకమిషన్‌కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సుముఖత చూపలేదు. నెలరోజులకు పైగా మార్చురీలో ఉన్న మృతదేహం డీకంపోజ్ అవుతోందని, వెంటనే తీసుకెళ్లాలని ఎస్వీ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ వైద్యులు పోలీసులకు సూచించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తిరుపతిలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. విదేశీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మౌర్యకు కలెక్టర్ సూచించారు. శనివారం పోలీసులు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని శ్యాంప్సన్ మృతికి సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన సంజయ్‌గాంధీ కాలనీ స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

5న ఐదు లక్షల మొక్కలు నాటాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన జిల్లావ్యాప్తంగా 5లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, డ్వామా, గ్రామ పంచాయతీ శాఖ అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు మండలాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోందని, అక్కడ నిమ్మ తోటలు పెంచేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ ఏడాది అధికంగా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో పంట కాల్వలు, చెరువు కట్టలు, చెక్‌డ్యామ్‌లను బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగు, చెత్త తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు

● అనుమతిచ్చిన ప్రభుత్వం

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలు లేని చోట్ల, రూ.10 లక్షల అంచనా వ్యయం పైబడిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచేందుకు అనుమతించాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో నిర్వహణ కింద రూ.344.39 కోట్లతో 7174 పనులు చేపట్టేందుకు సంబంధిత అనుమతులు అవసరమని కోరారు. ఇందులో తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 పనులు ప్రతిపాదించారు. షార్ట్ టెండర్ నోటీసులు జారీ చేసి ఈ పనులు చేపట్టేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

జల్సాల కోసం చోరీలు

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లు, విలాసజీవతం కోసం అప్పులపాలయ్యాడు. ఆపై సులభ సంపాదనకు దొంగతనం వైపు అడుగేసిన అతడిని తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం జిల్లా అదనపు ఎస్పీ నాగభూషణరావు తెలిపిన మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం వంకమద్దివారిపల్లికి చెందిన తమటం భానుచంద్రాచ్చారి చిన్నప్పుడే చెడు అలవాట్లకు లోనయ్యాడు. చుట్టు పక్కల వారిని చూసి తానూ విలాస జీవితం గడపాలని అప్పులుచేసి ఇల్లు కట్టాడు. చివరకు అప్పులు తీర్చలేక.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె, చెర్లోపల్లె, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశాడు. ఇళ్లు, దుకాణాల్లో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, టీవీలను విక్రయించేవాడు. ఆ డబ్బుతో కొంత అప్పులు తీర్చి మిగతా జల్సాలకు ఖర్చు చేసేవాడు. ఇతనిపై చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనూ పలు దొంగతనం కేసులు ఉన్నట్లు సమాచారం. మే 4న శ్రీకృష్ణనగర్‌లోని పుల్లారెడ్డి కుటుంబం బెంగళూరకు వెళ్లింది. మళ్ళీ మే 16న ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉంది. ఇంట్లోని దాదాపు 21 గ్రాముల బంగారు నగలు, 488 గ్రాముల వెండి వస్తువులు, రెండు టీవీలు, ఇతర వస్తువులు లేవు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు బాధితుడు పిర్యాదు చేశారు. పాత నేరస్తులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించారు. వేలి ముద్రలు, ఫొటో ఆధారంగా నిందితుడు చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వాడని గుర్తించారు. అతడి సెల్‌ఫోన్ నెట్‌వర్కు ఆధారంగా శనివారం రాయలచెరువు రోడ్డులో తచ్చాడుతుండగా క్రైం డీఎస్పీ నేతృత్వంలోని సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, క్రైం పార్టీ పోలీసులు నిఘా ఉంచి అరెస్టు చేశారు. ఎస్వీయూ పరిధిలో జరిగిన రెండు చోరీలు, క్రైం పరిధిలో జరిగిన ఒక చోరీ కేసుకు సంబంధించి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రెండు టీవీలు, గ్యాస్ సిలిండర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐలతో పాటు ఎస్ఐ, ఏఎస్ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మురళి, మునిరాజ, రమేష్, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, ఈశ్వర్, హరిప్రసాద్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



తిరుపతిలో క్రైం పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

3న విచారణకు రండి

ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడికి నోటీసులిచ్చిన వైద్య ఆరోగ్యశాఖ

చిత్తూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ హంస (ఏపీహెచ్ఎఎంఎస్ఏ)పై వచ్చిన విమర్శల నేపథ్యంలో విచారణకు రావాలని రాష్ట్ర అధ్యక్షుడికి వైద్య ఆరోగ్యశాఖ నోటీసులిచ్చింది. ఈనెల 3వ తేదీన విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ ముందు హాజరు కావాలని అందులో పేర్కొంది. గతనెల 25వ తేదీన రాత్రి సాధారణ బదిలీల నుంచి కొందరు ఉద్యోగులను తప్పించడానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో ఉన్న మీటింగ్ హాల్‌లో అసోసియేషన్ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అత్యవసర సమావేశం పెట్టి, తాలుకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారన్న ఆరోపణలున్నాయి. ఇదే అంశంపై ఈనెల 28వ తేదీన 'బదిలీల నుంచి తప్పించేందుకు రాత్రికి రాత్రి యూనియన్ ఎన్నికలు!' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. 'బోగస్ మెంబర్‌షిప్ చూపుతున్నారని, బోగస్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని, డబ్బులకు ఆఫీస్ బేరర్ల పోస్టులు అమ్ముకుంటున్నారని, ఆ పోస్టులు ద్వారా బదిలీల నుంచి ఉద్యోగులను తప్పించేలా చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై విచారణకు రావాలి' అని ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడికి నోటీసులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బైక్‌పై కలెక్టరేట్‌కొచ్చిన ఎమ్మెల్యే



చిత్తూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): కాన్వాయ్, గన్‌మెన్, పీఏ వంటి ఆర్భాటాలు లేకుండా సాధారణ వ్యక్తిలా బైక్‌పై కలెక్టరేట్‌కొచ్చారు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్. శనివారం చిత్తూరు లక్ష్మీనగర్‌లోని తన నివాసం నుంచి బైక్‌పై పూతలపట్టు మండల టీడీపీ నేత దొరబాబుతో కలిసి బయల్దేరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తన నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై చర్చించారు. తిరిగి అదే బైక్‌పై ఇంటికెళ్లారు.

టమోటా

పలమనేరు మార్కెట్ యార్డులో 15 కిలోల బాక్సు ధర రూ.40-60

ఆందోళనలో రైతులు

పలమనేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ యార్డులో టమోటా ధరలు దారుణంగా పతనమయ్యాయి. ఆరేడు నెలలుగా 15కిలోల బాక్సు ధర రూ.120- 160 వరకు పలుకుతూ వచ్చింది. అయితే వారం రోజులుగా ఈ ధరలు మరింత దిగజారి పోయాయి. 15 కిలోల బాక్సు కేవలం రూ.40-60 మాత్రమే పలుకుతోంది. ఎకరా సాగుకు కనీసం రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. సాధారణంగా జనవరి నుంచి ఏప్రిల్ మాసాల వరకు ధరలు కొంత తగ్గుముఖం పట్టినా మేనెలలో మాత్రం మంచి ధరే దక్కుతుండేది. ఈ ఏడాది ఇందుకు భిన్నంగా ఏడెనిమిది నెలలుగా ఆశించిన ధర రాలేదు. దీంతో టమోటా సాగుచేసిన రైతులు చేసిన అప్పులెలా తీర్చాలన్న ఆందోళనలో ఉన్నారు. కొందరు రైతులైతే కూలీలకు కూడా డబ్బులు రావన్న నిరాశతో తోటల్లోనే టమోటాలను వదిలేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.50కి ఆరునుంచి ఏడు కిలోలను విక్రయిస్తున్నారు. కొందరు సంపన్న రైతులు టమోటాలను అధికంగా సాగు చేయడంతో దిగుబడి పెరగడం కూడా ధరల పతనానికి ఓ కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

22 మండలాల్లో వాన

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉదయం 8 నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 22 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా సోమలలో 50.4, అత్యల్పంగా పెద్దపంజాణిలో 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. పెనుమూరులో 42.6, గంగాధరనెల్లూరులో 35.6, పాలసముద్రంలో 32.2, శ్రీరంగరాజపురంలో 23.2, పూతలపట్టులో 20.4, తవణంపల్లెలో 20, నగరి, చిత్తూరు మండలాల్లో 19.6, విజయపురంలో 15.2, సదుంలో 13.2, నింద్ర, ఐరాల, యాదమరి మండలాల్లో 12.2, కార్వేటినగరంలో 11.6, గుడిపాలలో 7.8, బంగారుపాళ్యంలో 7, వెదురుకుప్పంలో 6.4, చౌడేపల్లెలో 6, పుంగనూరులో 5.2, పులిచెర్లలో 5 మి.మీ వర్షం కురిసింది.

చిన్నారుల మృతదేహాలు కుటుంబీకులకు అప్పగింత



మృతదేహాన్ని అంబులెన్స్‌లో సొంతూరుకు తరలిస్తున్న కుటుంబీకులు

యాదమరి, మే 31 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని కీనాటంపల్లె పంచాయతీ కోయివూరు కొత్తచెరువులో శుక్రవారం ఈతకోసం దిగిన చిన్నారులు అభిలాష్ (13), సిద్ధు (11) మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక శనివారం కుటుంబీకులకు అప్పగించారు. వారు మృతదేహాలను తమ స్వగ్రామాలైన తుమ్మిందపాళెం, సామిరెడ్డిపల్లెకు తీసుకెళ్లారు. తమతో ఆడుతూపాడుతూ అందరితో ఆప్యాయంగా గడిపిన చిన్నారులు సైతం అభిలాష్, సిద్ధు తల్లిదండ్రులను పట్టుకుని రోదించడం అక్కడి వారందరినీ కలచివేసింది.

అపోలో ఆస్పత్రి వద్దంటూ సంతకాల సేకరణ



సంతకాలు చేస్తున్న ప్రజలు

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): అపోలో యాజమాన్యానికి వ్యతిరేకంగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సంరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎంఎస్ఆర్ జంక్షన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 2378 మంది అపోలో ఆస్పత్రి యాజమాన్యానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఇప్పటి వరకు 2476 మంది సంతకాలు చేసినట్టు ఆ కమిటీ కో-ఆర్డినేటర్ షణ్ముగం తెలిపారు. ఈనెల మూడో తేదీన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి విచారణ కమిటీ రానుండటంతో ఆ కమిటీ ముందు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛందసంస్థల నిర్వాహకులతో కలిసి అపోలో ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యంపై విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ శోభారాణి, సభ్యులు షాదిక్, కుమరేష్, హరిప్రసాద్, జయచంద్ర, కరుణాకరన్, చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

కుమార్తెతో వివాహిత అదృశ్యం



ప్రియాంక, కావ్యశ్రీ

బంగారుపాళ్యం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లె గ్రామానికి చెందిన ఓ వివాహిత తన మూడు సంవత్సరాల కుమార్తెతో అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... బలిజపల్లె గ్రామానికి చెందిన కుమార్‌రాజా భార్య బలిజ ప్రియాంక, తన 3 సంవత్సరాల కుమార్తె కావ్యశ్రీలు ఈ నెల 28వ తేదీ ఉదయం నుంచి కనిపించకపోవడంతో శనివారం భర్త స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

చౌడేపల్లె, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని.. కోర్సు పూర్తయిన వారికి ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కుప్పం వైసీపీలో 'సర్దుబాటు' సాధ్యమేనా?

● మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన సస్పెన్షన్ నేతలు



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు, ఆరేళ్ల జయప్ప, నీలావతి

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్ల పర్వంతో కుప్పం వైసీపీ నిలువునా చీలిన సూచనలు కనిపిస్తున్నాయి. సస్పెన్షన్‌కు గురైన నియోజకవర్గ నేతలు శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రాజీనామా చేశాక, కాస్త స్తబ్దుగా కనిపించిన వైసీపీ రాజకీయాలు ఈ పరిణామంతో మళ్లీ వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. 'సర్దుబాటు' చేస్తానని పెద్దిరెడ్డి అన్నట్లు చెబుతున్నారు కానీ, అందుకు తగిన పరిస్థితులు ఇప్పుడున్నాయా? అన్నది అనుమానమే.

గతంలో ఏం జరిగిందంటే..

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు, కుప్పం మండలం వసనాడు మాజీ సర్పంచి మురళి, శాంతిపురం మొరసనపల్లె సర్పంచి జగదీశ్ సతీమణి నీలావతిలను గత నెల రెండో వారంలో పార్టీనుంచి సస్పెండు చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి ఆదేశాలు ఇవ్వడం తెలిసిందే. మరుసటి రోజున వీరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొనడం నేరమంటూ రామకుప్పం మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఆరేళ్ల జయప్ప, కుప్పం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సర్దార్‌బాషాలు సస్పెండ్ చేయడమూ తెలిసిందే. సర్దార్‌బాషా తన సస్పెన్షన్‌పై ఎమ్మెల్సీ భరత్‌ను టార్గెట్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసి.. సామాజిక మాధ్యమాల్లో అదే రోజు పోస్ట్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోంది తాము కాదని, భరత్ మాత్రమేనని అందులో తీవ్ర ఆరోపణలు చేశారు. అంతకు ముందు జడ్పీటీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలోనూ అక్కడి నేతలందరూ ఇదేరకమైన ఆరోపణలు భరత్‌పై గుప్పించారు. ఇదే నెలలో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ చైర్మన్ అభ్యర్థి సెల్వరాజ్ ఎన్నికకు సహకరించారంటూ 10 మంది కౌన్సిలర్లను సైతం సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ల పర్వం అనంతరం ఏకంగా వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈయన కూడా భరత్‌తోపాటు, కరుణాకరరెడ్డిపై విమర్శలు గుప్పించారు. వీరంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తమ విశ్వాసం ప్రకటించారు. సస్పెండ్ చేయడానికి కరుణాకరరెడ్డి, భరత్‌లు ఎవరని నిలదీశారు. అలా చేయడం ద్వారా తామంతా పెద్దిరెడ్డి వర్గమని ప్రకటించుకున్నారు. అందువల్లనే తాము టార్గెట్ అయ్యామన్న ఆలోచన పార్టీ వర్గాల్లో రేకెత్తించేలా వారి వ్యవహార శైలి కొనసాగింది.

వీలవుతుందా?

శాంతిపురం జడ్పీటీసీ శ్రీనివాసులు, మొరసనపల్లె సర్పంచి జగదీశ్ సతీమణి నీలావతి, రామకుప్పం నాయకులు ఆరేళ్ల జయప్పలు ఈ సస్పెన్షన్ల పర్వం నేపథ్యంలోనే శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వీరు ముగ్గురూ.. భరత్, కరుణాకరరెడ్డిలపై ఫిర్యాదు చేశారు. తాము ఎటువంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని, కావాలనే టార్గెట్ చేశారని మొరపెట్టుకున్నారు. ఓపిగ్గా ఉండమని, అంతా సర్దుబాటు చేస్తామని పెద్దిరెడ్డి చెప్పినట్లు తెలిసింది. అయితే దీనికి భిన్నంగా మరో వాదన కూడా వినిపిస్తోంది. కుప్పం వైసీపీలో కూడా త్వరలోనే మార్పులు ఉండబోతున్నాయని, అంతదాకా సర్దుకుంటే మంచి రోజులు వస్తాయని తనను కలిసిన నేతలతో అన్నట్లు మరికొందరు చెబుతున్నారు. అయితే జడ్పీటీసీ స్థాయి నేతను పార్టీనుంచి సస్పెండ్ చేయడమన్నది అధినేత జగన్‌రెడ్డికి తెలియకుండా జరిగే పనికాదు. అధికారం కోల్పోయిన దగ్గరనుంచి పెద్దిరెడ్డితో పాటు ఆయన కుమారుడు ఎంపీ మిథున్‌రెడ్డి కూడా స్వయంగా కొన్ని ఇబ్బందుల్లో ఉన్నారు. ఇటువంటి సమయంలో పార్టీ అధిష్ఠానానికి తెలిసి జరిగిన సస్పెన్షన్ల విషయంలో వేలుపెట్టి మరిన్ని కష్టాలు కొనితెచ్చుకోవడానికి పెద్దిరెడ్డి ఇష్టపడతారా? అన్నది వేయి డాలర్ల ప్రశ్న.

భోజన తయారీ పోటీల్లో జిల్లాకు రెండో స్థానం



జేడీ నుంచి అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన తయారీ పోటీల్లో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. పీఎం పోషణ్, మధ్యాహ్న భోజన, స్కూల్ శానిటేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం గన్నవరంలోని కొండపావులూరులో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ చేసేవారికి పోటీలు నిర్వహించారు. ఒక్కో జిల్లా నుంచి ఎనిమిది మంది పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో మన జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఎండీఎం జాయింట్ డైరెక్టర్ గంగాభవాని నుంచి అవార్డు అందుకున్న వారిలో.. చిత్తూరు రూరల్ బీఎన్ఆర్ పేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రమేష్, ఎండీఎం సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ బాలాజి, వర్కర్లు చిత్తూరు మండలం తుమ్మింద జడ్పీహెచ్ఎస్‌లోని అమ్ములు, పాలసముద్రం మండలం ఎస్‌కేఆర్‌పురం ఎంపీయూపీ స్కూల్ నుంచి భారతి ఉన్నారు.

బాల కార్మికులతో పనులు చేయించడం నేరం: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో సంబధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. 14 ఏళ్లలోపు బాల బాలికలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి ఆరు నెలల నుంచి రెండేళ్ల జైలు శిక్ష, రూ.20వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. బాల కార్మికులపై ఫిర్యాదు చేయాలంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098ని సంప్రదించాలని కోరారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టం, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్మికశాఖ అధికారి ఓంకార్, ఏపీసీ వెంకటరమణ, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణి హంతకుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎఫ్ఆర్వో జయశంకర్

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను హతమారుస్తున్న వ్యక్తిని కుప్పం అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో శనివారం మీడియాకు ఎఫ్ఆర్వో జయశంకర్ వివరాలు తెలిపారు. కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ వాలూరు గ్రామానికి చెందిన కనకరాజ్ (26) వన్యప్రాణులను హతమారుస్తున్నట్లు కుప్పం అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. శనివారం అటవీ ప్రాంతంలో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. మల్లప్పకొండ సమీపంలో నిందితుడు కనకరాజ్ వారికి పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి కిలో చుక్కల దుప్పి మాంసం, చర్మం, నాటు తుపాకీతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అరెస్టు చేసి, కోర్టు ఎదుట హాజరు పరచి రిమాండుకు తరలించారు. సమావేశంలో డీఆర్వో సమీర్ బాషా, ఎఫ్‌బీవోలు మధు, రహమాన్ పాల్గొన్నారు.

పొగాకు మానండి.. క్యాన్సర్‌కు దూరంగా ఉండండి



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు మానండి.. క్యాన్సర్‌కు దూరంగా ఉండండి.. అని అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా నగరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల యాక్ట్ ప్రకారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచారం ఉండే ప్రదేశాల్లో ధూమపాన నిషేధం అమల్లో ఉందన్నారు. దీన్ని అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. అనంతరం టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీ నుంచి దర్గా సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐవో హనుమంతరావు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

చిత్తూరు కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియపై అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) చిట్టెమ్మకు బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామవాసి కెప్రసాద్ శనివారం ఫిర్యాదు చేశారు. 'శుక్రవారం మొగిలీశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు సందర్భంగా సుమన ప్రియ తన దుస్తుల్లో డబ్బులు దాస్తుండగా చూశాను. ఆమె అనుమతితో మా గ్రామస్తురాలితో తనిఖీ చేయించగా, రూ.13,000 బయటపడ్డాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలి' అని ఫిర్యాదులో ప్రసాద్ పేర్కొన్నారు. ఈ విషయమై మొగిలి గుడి ఈవో మునిరాజును వివరణ కోరగా.. తనకీ విషయం తెలియదన్నారు. కనుక్కుంటానని చెప్పారు. ఇక ఏసీ చిట్టెమ్మ అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరా



బల్క్ సెంటర్ నుంచి కళాశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తున్న సిబ్బంది

చిత్తూరుసెంట్రల్,మే31(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభానికి ముందే జిల్లాకు చేరిన పాఠ్య, నోటు పుస్తకాల సరఫరా శనివారం మొదలుపెట్టారు. ఈనెల రెండో తేదీన కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి.74 ప్రభుత్వయాజమాన్య కళాశాలల్లోని విద్యార్థులకు తొలిరోజునే పాఠ్యపుస్తకాలుఅందించనున్నారు.ఇందుకోసం జిల్లాకు ఫస్టియర్‌లో 28,807 పాఠ్యపుస్తకాలు వచ్చాయి.వీటిలో ఇంగ్లీష్ 6252, తెలుగు 5956, సంస్కృతం 6, హిందీ 17, ఉర్దూ 178, మ్యాథ్స్ 2032, ఫిజిక్స్ 3022, కెమిస్ట్రీ 3022, బయాలజీ 1270, హిస్టరీ 88, ఎకనామిక్స్ 1855, సివిక్స్ 1575, కామర్స్ 1767, అకౌంటెన్సీ 1767 ఉన్నాయి. సెకండియర్‌లో 5464 మంది విద్యార్థులకు ఇప్పటికే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయగా.. మరో 11,382 పాఠ్యపుస్తకాలు అందించనున్నారు.

రెస్కో ఎండీ పదవీకాలం 6 నెలల పొడిగింపు



సురభి సోమశేఖర్

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) మేనేజింగ్ డైరెక్టర్ సురభి సోమశేఖర్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్పీడీసీఎల్ ఈఈగా ఉంటూ డిప్యుటేషన్‌పై ఆయన రెస్కో ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. సోమశేఖర్ నిజానికి శనివారం పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే రెస్కో ఎండీగా ఆయన పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

చెరకు రైతుల బిల్లులపై స్పందించిన ప్రభుత్వం



గత ఏడాది జీరో అవర్‌లో అసెంబ్లీలో చెరకు బిల్లులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలోని నింద్ర మండలంలో ఉన్న నేతమ్స్ చక్కెర కర్మాగారం నుంచి రైతులకు రావాల్సిన బకాయిలపై స్పందించాలని 2024 నవంబరు 21వ తేదీన జరిగిన అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. 2019-20 క్రషింగ్ సీజన్‌లో రైతుల నుంచి చెరకును సరఫరా చేసుకున్న యాజమాన్యం ఇప్పటి వరకు బకాయిలు ఇవ్వకపోవడంతో అప్పులపాలై భూములు అమ్ముకునే పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే తెలిపారు. స్పందించిన పరిశ్రమలు, కామర్స్ విభాగం ప్రభుత్వ కార్యదర్శి.. రైతులకు రావాల్సిన బకాయిలు అందేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు కూడా ఆయన లేఖ ద్వారా తెలియజేశారు.

జడ్పీలో 36 మంది బదిలీ

చిత్తూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్(జడ్పీ)లో సాధారణ బదిలీల్లో భాగంగా శనివారం 36 మందిని బదిలీ చేస్తూ సీఈవో రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 24 మంది సీనియర్ అసిస్టెంట్లలో 10 మందికి ఐదేళ్లు పూర్తవగా, 14 మందిని రిక్వెస్ట్‌పై బదిలీ చేశారు. అలాగే 12 మంది ఏవోల్లో నలుగురికి ఐదేళ్లు పూర్తవగా, 8 మందిని రిక్వెస్ట్‌పై బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు, ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో వెంటనే చేరాలని సీఈవో ఆదేశించారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధికి మార్గం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో స్వయం ఉపాధికి మార్గం ఏర్పడుతుందని కుప్పం టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలం లోని మల్లానూరులో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా కుట్టు మిషన్‌ను ఉచితంగానే ప్రభుత్వం శిక్షణార్థులకు ఇస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధికారులకు సూచించారు. శనివారం మున్సిపల్ సమావేశ భవనంలో మున్సిపల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని రాధాబంగ్లా వద్ద లోఓల్టేజీ సమస్య ఉందని.. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ స్థలాన్ని ఆర్టీసీ బస్టాండుకు ఉచితంగా ఇవ్వడం జరిగిందని.. అయితే నేడు ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిచేందుకు, తిప్పుకునేందుకు కూడా స్థలం లేకుండా గదుల నిర్మాణానికి స్థలాలు కేటాయిస్తూ వాణిజ్య సముదాయం లా మార్చేస్తున్నారన్నారు. ఇకపై గదులు నిర్మించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ కోదండ రామయ్య మాట్లాడుతూ గంటావూరు ఇందిరమ్మ కాలనీలో అర్బన్ ఆరోగ్య కేంద్ర భవనం పనులు సత్వరమే పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ వీధుల్లో వీధికుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని.. కట్టడి చేయాలని వాపోయారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు పిలిచిన టెండర్లను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం


చల్లా రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

రొంపిచెర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజలకు న్యాయం జరుగుతోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసానికి వచ్చిన పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలపై సంబంధిత తహసీల్దారుతో సంప్రదించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సదుం మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి పలు సమస్యలను చల్లా దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం యల్లంపల్లిలోని సీతామస్వామి దేవస్థానం గోపుర కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠకు టీడీపీ నాయకుడు మల్లెల సురేష్‌తోపాటు ఆలయ కమిటీ సభ్యులు చల్లాకు ఆహ్వాన పత్రిక అందించారు. అలాగే బొమ్మయ్యగారిపల్లెలోని ఆలయంలో పూజలకు, గానుగచింత దాసరిగూడెంలోని గొల్లపల్లెమ్మ జాతరకు ఆహ్వానించారు. టీడీపీ నాయకులు రంగనాథ్, జయరామయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. శనివారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజాపంపిణీ ప్రక్షాళనలో భాగంగానే ఆదివారం నుంచి చౌకదుకాణాల వద్దే రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభిస్తోందన్నారు. కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల టీడీపీ నేతలు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో నేతలు చలపతి, సీతాపతి, మహ్మద్‌రఫీ, జయశంకర్, సత్తి, విశ్వనాథ్, వెంకటాచలం, విజయ్‌కుమార్‌రెడ్డి, టీవీరవి, ఆదిల్, అల్లీశీన, రామలింగారెడ్డి, అవినాశ్, సుబ్రీ, మురళీమోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నానికి సన్మానం


వెంకటరత్నంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్తులు

పలమనేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మాజీ ఎంపీపీ వెంకటరత్నాన్ని శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కొలమాసనపల్లిలోని చెల్వరాయస్వామి ఆలయం వద్ద వెంకటరత్నం పుట్టినరోజు జరుపుకున్నారు. కార్యక్రమంలో కొలమాసనపల్లి మాజీ సర్పంచులు సెల్వరాజు, హేమసుందరం, షరీఫ్, మణి, యువనాయకులు వినోద్, వెంకటేష్, సునీల్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైసీపీ యువజన కార్యదర్శిగా కిషోర్

గంగవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైసీపీ యువజన కార్యదర్శిగా గంగవరానికి చెందిన కిషోర్ ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి శనివారం నియామకపత్రం కిషోర్‌కు అందింది. తనపై నమ్మకంతో రెండోసారి పదవీ అవకాశం కల్పించిన వైసీపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రొంపిచెర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు డాక్టర్ రాజేంద్ర యోగి అన్నారు. రొంపిచెర్ల షాదీ మహల్‌లో సచివాలయాల సిబ్బందికి ఆయన యోగాపై శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల యోగాసనాలను వేయించి వాటి ప్రయోజనాలు వివరించారు. మనస్సు శరీరం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా మంచి సాధనం అన్నారు. ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకుని ఆధ్యాత్మికత వైపు నడవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు తమ సత్తా చాటాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పులిచెర్ల మండలం కల్లూరులో శనివారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో పుంగనూరు మండలం గుండ్లపల్లెకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుభాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, అగిస్తిరెడ్డి, కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసుకున్నారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆశయాలను, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మాధవరెడ్డి, నాయకులు బీటీ రెడ్డెప్ప, ఉయ్యాల రమణ, కుమార్‌రెడ్డి, ముల్లంగి రమణ, చిన్నరెడ్డెప్ప, మనోజ్, సందీప్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలి

బైరెడ్డిపల్లె, మే 31 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఏటా మండలంలో దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నప్పటికీ చాలామంది బైరెడ్డిపల్లెలో కళాశాల సౌకర్యం లేక ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించలేకపోతున్నారు. బైరెడ్డిపల్లెలోని జడ్పీఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి జూనియర్ కళాశాలగా చేస్తే మండలంలో పదోతరగతి ఉత్తీర్ణులయ్యే పలువురు విద్యార్థులు కాలేజీ చదువుల కోసం పలమనేరు, వి.కోట తదితర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడే ఐటీఐ, పాలిటెక్నిక్ కూడా బైరెడ్డిపల్లెలో ఏర్పాటు చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పలువురు కోరుతున్నారు.

ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

రొంపిచెర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాలపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. రొంపిచెర్లలోని చౌకదుకాణాలను ఆయన శనివారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి



పుంగనూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యశ్లోక అహల్యాబాయి జయంతి వేడుకలను పుంగనూరులో బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, జగదీష్‌రాజు, పెద్దమరంబాబు, రమేశ్, టీవీఎస్ ప్రసాద్, చంద్రశేఖర్‌రాజు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయండి


అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న డీలర్లు

పలమనేరు, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణ డీలర్లు నిత్యావసర సరుకులను ప్రజలకు పారదర్శకంగా పంపిణీ చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శనివారం నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాల్లోని డీలర్లు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానించారు. జూన్ 1 నుంచి నిత్యావసర సరుకులను చౌకదుకాణ డీలర్ల ద్వారానే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు విశ్వనాథరెడ్డి, మునిరత్నం, వినోద్, మోహన్‌రామిరెడ్డి, బసవరాజు, నరసింహారెడ్డి, రవిస్వామి, ప్రకాష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం



ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సదుం, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం ప్రాణాంతకమని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.గిరీషా పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామంలో పొగాకు అనర్థాలపై ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగంపై కొన్ని రకాల కంపెనీలు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ్ భాస్కర్, నీలకంఠ, జానకి శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవి పందులతో టమోటా పంటకు నష్టం

సోమల, మే 31 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీలో అడవి పందులు టమోటా తోటల్లో తిరగడంతో ఊతంగా నాటిన కర్రలు నేల వాలాయి. అడవి పందులు టమోటాలను తిన్నంత తిని కోతకు వచ్చిన పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. సోమలకు చెందిన శెట్టివారి సురేంద్ర, శంకరయ్య , సోమశేఖర్ టమోటా తోటల్లో సంచరించి నష్టపరిచినట్లు రైతులు తెలిపారు. పొలం వద్ద రాత్రి వేళ రైతులు జాగారం చేస్తున్నా ఏదో సమయంలో పంటలపై దాడులు చేస్తున్నట్లు వాపోయారు. ధరల్లేక అల్లాడుతుంటే ఇలా ఉన్న పంటలపై అడవి పందుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కుప్పం చెరువు

బాగుపడేదెప్పటికో..!


కుప్పం చెరువులో పెరిగిన పనికిరాని పొదలు


చెరువులో అక్రమార్కులు తవ్వేయగా ఏర్పడ్డ గుంతలు

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు నిలువెత్తున పెరిగిపోయిన చెత్తపొదలు.. మరోవైపు అక్రమంగా మట్టి తీసేయడంతో ఏర్పడ్డ లోతైన గోతులతో కుప్పం చెరువు పరిస్థితి దారుణంగా తయారైంది. పట్టించుకునేవారు లేక రోజురోజుకూ కుదించుకుపోతోంది. కుప్పం పట్టణాన్ని ఆనుకుని ఉన్నది కుప్పం చెరువు. దీనిపైన ఇప్పటికే రెండు వంతెనలు నిర్మించేశారు. ఒకటేమో విజలాపురం కూడలినుంచి పైబాట కూడలి వరకు వేసిన వంతెన. రెండోదేమో గుడుపల్లె రోడ్డులోని సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన వంతెన. రాకపోకలకు అవసరం కాబట్టి వంతెనలు నిర్మించారు. అయితే చెరువును ఎవరూ పట్టించుకోవడంలేదు. కానీ వానలు వచ్చినా నిండటం లేదని, నిండినా రెండుమూడు రోజులు సైతం నీరు నిల్వ ఉండటం లేదని చెరువును ఆడిపోసుకునే వారే అధికంగా ఉంటున్నారు.

ఈ చెరువు కింద ఆయకట్టు లేకపోయినా బాగు చేస్తే ఊట చెరువుగా మారి పట్టణంలో అడుగంటిపోయిన భూగర్భ జలాల పెంపునకు దోహదం చేస్తుంది. అయితే కుప్పం చెరువును పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. ఈ చెరువు నిండా నిలువెత్తున పనికిరాని పొదలు పెరిగిపోయాయి. అసలీ చెరువు.. చెరువులా కనిపించడం లేదు. వృథాగా వదిలేసిన పచ్చటి బీడు భూమిలా అనిపిస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు కొందరు చెరువును లోతుగా తవ్వేసి మట్టిని తీసుకెళ్లిపోయారు. ఇప్పుడు సోమేశ్వరాలయం వైపున లోతైన గుంతలు మాత్రం మిగిలాయి. ఒకవైపు చిటపట చినుకులు రాలుతూ వర్షాగమనాన్ని సూచిస్తున్నాయి. చెరువును బాగు చేయడానికి ఇదే సమయం. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువులోని పనికిరాని పొదలను తొలగించి పూడిక తీసి సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. వర్షాలు పెరిగేలోపు చెరువును బాగు చేస్తే నిండైన నీటితో కుప్పం చెరువు ఊటచెరువుగా మారి భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడనుంది. దీంతో కుప్పం పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తుంది. ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కుప్పం ప్రజలు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుప్పం పురపాలక సంఘానికి సంబంధించిన 14 మంది లబ్ధిదారులకు వారు రూ.15 లక్షలు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసహాయకులకు అండగా నిలవడమే కాకుండా వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని పథకాలను టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్‌లతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీతో అభాగ్యులకు ఆసరా


కుప్పం మున్సిపాలిటీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు


బిరుగుండ్లపల్లెలో పింఛను అందజేస్తున్న ఆనందరెడ్డి


పలమనేరు: దివ్యాంగుడికి పింఛను అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

కుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీతో అసహాయులకు ఆసరా లభిస్తుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే శనివారం నాడు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కుప్పం పురపాలక సంఘం 13, 14, 15 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ల నగదును స్వయంగా అందజేశారు. కుప్పం పురపాలక సంఘంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కుప్పం మండలంలోని గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సైతం ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకుడు పి.గోపీనాథ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, మైనారిటీ నాయకుడు అన్సర్ బాషా, మాజీ ఎంపీటీసీ వరదరాజులు, మాజీ వార్డు సభ్యురాలు జయలక్ష్మి, మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపడుతున్నామని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేట, రేణుమాకులపల్లి, నన్నూరివారిపల్లి పంచాయతీల్లో లబ్ధిదారులకు అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: చౌడేపల్లె మండలంలో శనివారం ఒకరోజు ముందుగానే 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. 6,494 మందికి గాను 6,082 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

సోమల: పింఛన్ల పంపిణీలో అధికారులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా లబ్ధిదారులకు అందజేయాలని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు కోరారు. శనివారం ఇరికిపెంట, లక్ష్మీపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యదర్శి మేనక, సర్పంచి రెడ్డెప్ప, నీటి సంఘ అధ్యక్షుడు బోస్, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో శనివారం 95.41 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో 4,505 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. శనివారం 4,298 మందికి పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల పింఛన్లను ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేశామని తెలిపారు.

రామకుప్పం: మండల పరిధి పెద్దకురబలపల్లెలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బిరుగుండ్లపల్లె, ముద్దనపల్లె, యానాది కాలనీల్లో టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, మాజీ ఎంపీటీసీ నారాయణశెట్టి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. రామకుప్పంలో మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఎస్.గొల్లపల్లె, ఆవులకుప్పం గ్రామాల్లో తెలుగు యువత మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, ఉస్సిగానిపల్లెలో తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శంకర్‌చలం లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


వెంకటలక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 31(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణం శివాజీనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త వెంకటలక్ష్మమ్మ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి శనివారం ఉదయం స్థానిక నేతలతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులు పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే టీడీపీ సీనియర్ నేత కోదండరెడ్డి తల్లి మునెమ్మ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణలతో కలసి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నేతలు రామ్మూర్తి, సీతాపతి, రామకృష్ణప్ప, జయశంకర్, టీవీరవి, పద్మనాభరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సలాంసాబ్, మంజునాథ్, వెంకటరమణ, ఆదిల్, శ్రీరాములురెడ్డి, బాలరాజు, సుబ్రీ, నరసింహులు, అవినాశ్, సతీష్, అంజీ, చలపతి, నిసార్, రామలింగారెడ్డి, గిరిదాసు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

భారతంమిట్టలో భీష్మ విజయం



సోమల, మే 31 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని భారతంమిట్ట వద్ద మహాభారత యజ్ఞం సందర్భంగా శనివారం పాండవ విగ్రహాలకు ఉదయం ఉభయదారులు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భాగవతారణి నాగరత్న భీష్మ విజయం కథను భక్తులకు వివరించారు. రాత్రి పీలేరు వెంకటేశ్వర నాటకమండలి కళాకారులు నాటక ప్రదర్శనలతో భక్తులను రంజింపచేశారు. ఉభయదారులు బత్తల గంగాధరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుష్పపల్లకిపై కావమ్మ విహారం



కల్లూరు, మే 31: పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లెలో కావమ్మ మారయ్య తిరునాళ్లలో భాగంగా శనివారం దంపతులు పుష్పపల్లకిపై పురవీధుల్లో విహరించారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఊరేగింపులో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జంగాలకథ వినిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొల్లపల్లెమ్మకు అభిషేకాలు



రొంపిచెర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం నగరి దాసరి గూడంలో వెలసిన గొల్లపల్లెమ్మకు శనివారి పలు అభిషేక పూజలు చేపట్టారు. అమ్మవారి ఊరేగింపు, ఊంజల సేవ నిర్వహించారు.

ఆధ్యాత్మికం

చెన్నకేశవస్వామికి పూజలు

సోమల, మే 31 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీలోని చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేపట్టారు. ఆలయ అర్చకులు అభిషేక పూజలు చేశారు. చెన్నయ్యగారిపల్లె, దిడ్డివారిపల్లె, కరకమంద, నడింపల్లె, సోమలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం

సదుం: జాండ్రపేటలో వెలసిన రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయ 11వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు.

వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్లే ప్రజలకు సమస్యలు: థామస్



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత వల్లే ప్రజలకు సమస్యలు పెరిగిపోయాయని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలం వింజం దళితవాడలో ఎన్టీ ఆర్ భరోసా పింఛన్లను ఐదుగురికి పంపిణీచేసి, తర్వాత సీఎం సహాయనిధి కింద ఐదుగురికి చెక్‌లు, దివ్యాంగులుకు వీల్‌ఛైర్స్, సిద్దేశ్వరకొండలో వెటర్నరీ హాస్పిటల్ వద్ద పాడిరైతులకు పశుదాణా బస్తాలను థామస్ శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ నటులు రజనీకాంత్, కమలహాసన్‌లాగా నేనేమీ సెలబ్రిటీని కూడా కాదని, అయినా నా సమావేశాలకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారంటే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సమస్యల పరిష్కారం కోసమేనని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, బాలచంద్రారెడ్డి, దేవరాజులు, మురళిరెడ్డి, యువరాజారెడ్డి, ఎంపీడీవో సతీష్, వింజంసర్పంచ్ రామక్కగోవిందయ్య, వెటర్నరీడాక్టర్ మురళీమోహన్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు అందిస్తున్నాం

- ఎమ్మెల్యే మురళీమోహన్



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, మే 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వితంతువులు, వృద్ధులు, వికలాంగులకు సకాలంలో పింఛన్లు అందిస్తా ఇచ్చిన మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండల పరిధిలోని మోర్థానపల్లిలో ఎమ్మెల్యే శనివారం ఉదయం పలువురు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసి, గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారధి, ఎంపీడీవో వేణు, టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రటీ, అమర్‌నాథ నాయుడు, కార్తీక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కైలాసధామం మహాప్రస్థానానికి జేఎంసీ ట్రస్ట్ రూ.4 లక్షల విరాళం




నిర్వాహకులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కైలాసధామం మహాప్రస్థానానికి జేఎంసీ ట్రస్ట్ రూ.4 లక్షల విరాళం అందించింది. మహాప్రస్థానం సభ్యులు లయన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు, గోల్డ్ సర్వీస్ చిత్తూరు, చిత్తూరు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శనివారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలసి మహాప్రస్థానం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. నగరంలోని కైలాసపురంలో నూతనంగా నిర్మించిన ఎల్‌పీ గ్యాస్ ఆధారిత పర్యావరణహితమైన మహాప్రస్థానం జూన్ 6వ తేదీన ప్రారంభం కానుంది. కాగా మహాప్రస్థానం నిర్వాహకులకు జేఎంసీ ట్రస్ట్ తరపున ఎమ్మెల్యే రూ.4 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆరణి శివకుమార్, ఆరణి నరసింహులు, వెంకటేష్, ద్వారక, రామ్మూర్తి, శ్రీనివాసమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబ హుండీ ఆదాయం రూ.2.01 లక్షలు

చిత్తూరు కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో శనివారం అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో, యజమాన్యం నిర్వహించారు. హుండీ లెక్కింపులో అమ్మవారికి భక్తులు రూ.2,01120లను సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ పాలక మండలి ఛైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో మునిశేఖర్‌లు స్థానిక ప్రభుత్వ రంగ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు రమేష్, శ్రీకాంత్, మధు, జగదీశ్, గోవరన్, రవిలతో పాటు సిబ్బంది దాము, గోపి, గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా నగరంలోని నీవానది సమీపంలో కాశీ విశ్వేశ్వర(రాజుగుడి) ఆలయ హుండీ లెక్కింపులో స్వామివారికి భక్తులు రూ.82,498లు, బజారువీధి శివషణ్ముగ ఆలయ హుండీద్వారా స్వామివారికి భక్తులు రూ.59,316లు సమర్పించారని ఆలయాల సంయుక్త ఈవో వెంకటరాయలు తెలిపారు. ఈ మొత్తాలను స్థానిక ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఆలయాల యజమాన్యాల సమక్షంలో డిపాజిట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


టీడీపీ నగరి మండల ఎన్నికలు ఏకగ్రీవం



జవహర్‌లాల్‌రెడ్డి, వేణు

నగరి, మే 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నగరి మండల నూతన కమిటీని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా జవహర్‌లాల్ రెడ్డి, కార్యదర్శిగా వేణులను ప్రకటించారు. భవిష్యత్తులో టీడీపీని మండలంలో పటిష్ఠపరిచే విధంగా పని చేయాలని నూతన కమిటీకి పలువురు సూచించారు.

ఎస్సీ, ఎస్టీలకు జై భీమ్ ఫౌండేషన్ ఆదరణ



కార్వేటినగరంలో సంఘీభావం తెలుపుతున్న జై భీమ్ నాయకులు

వెదురుకుప్పం, మే 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీల్లో పేదవారు ఎక్కడ ఉన్న ఏస్థాయిలో ఉన్నా వారికి జై భీమ్ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం కార్వేటినగరంలో జై భీమ్ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ ఫౌండేషన్ లీగల్ అడ్వైజర్ పి.గుర్రప్ప, జనరల్ సెక్రటరీ నరేష్, ట్రెజరర్ అనిల్‌కుమార్, సభ్యులు వెంకటేష్, రాజ్‌కుమార్, ప్రవీణ్, పరందామ, కిరణ్, బొబ్బిలి, ప్రశాంత్, వేణు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చిత్తూరు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఒకటి, రెండవ పోలీసు స్టేషన్ల పరిధిలో శనివారం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా మైనర్ల డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 50 మంది వరకు పట్టుబడ్డారు. వారికి, వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలు వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని హెచ్చరిస్తూ, జరిమానా విధించి పంపించారు. కార్యక్రమంలో సీఐలు నెట్టికంతయ్య, మహేశ్వర, సిబ్బంది పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళ రసీదును అందిస్తున్న రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మే 31 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు రొంపిచెర్లకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే విశాఖ జిల్లా మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



అన్నదానం చేస్తున్న కేపీ శ్రీధర్ తదితరులు

చిత్తూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను నగరంలో కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు కేపీ శ్రీధర్, కొంబు, రావూరి రవి ఆధ్వర్యంలో పలు చోట్ల అన్నదానం చేశారు. అనంతరం గంగనపల్లిలోని వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు ప్రతాప్, నాని, దీన, మోహన్, ప్రేమ్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుతోనే కూటమి ప్రభుత్వానికి గొప్పపేరు



చంద్రశేఖర్‌కు నేతలతో కలిసి సన్మానం చేస్తున్న కృష్ణమ నాయుడు

గంగాధరనెల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలకు అందించే సేవలతోనే కూటమి ప్రభుత్వానికి గొప్పపేరు వస్తుందని పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు అన్నారు. గంగాధరనెల్లూరు మండల తహసీల్దార్‌గా పనిచేసిన చంద్రశేఖర్ శనివారం పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు పూలమాలలువేసి, శాలువలు కప్పి పలువురు టీడీపీ నేతలు, పలువురు అధికారులు వేర్వేరుగా సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, బాబునాయుడు, హరీష్‌యాదవ్, డీటీ తులసీరామ్, ఎన్నికల డీటీ మోహన్‌రాజా, మండల సర్వేయర్ సునీత, ఆర్ఐ ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

మామిడికి మద్దతు ధర ప్రకటించాలి

- ఈదెల వెంకటా చలంనాయుడు

చిత్తూరు కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన మామిడి రైతాంగానికి ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించి ఆదుకోవాలని రైతు శాంతియుత ఉద్యమ నాయకుడు ఈదెల వెంకటాచలం నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో తోతాపురి మామిడికి రూ.50 వేలు, బంగినపల్లె(బేనిషా)కు రూ.70 వేలు, నీలం మామిడికి రూ.90 వేలు, కాశేపాడు మామిడికి రూ.50 వేలు ప్రకటించాలని డిమాండ్‌జేశారు.

పేదలందరికీ ఇంటి పట్టాలివ్వించాలి

నగరి, మే 31 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు, ఇంటిస్థలం లేని వారికి అందరికీ ఇంటి పట్టాలివ్వించాలని నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. జూన్ 2న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ధర్నాలో ప్రతి పేదవాడు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. నగరి పట్టణంలో సుమారు 500మంది వరకు ఇంటి పట్టాల కోసం అర్జీలు ఇచ్చినట్లు వారు తెలిపారు. విజయపురం మండలంలోని 78 మందికి స్థలం వున్నా ఇంటి పట్టాలివ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాజేంద్ర, శేఖర్, బాషా, విజయకుమార్, మురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



మూర్తి (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మొగిలివెంకటగిరి మాజీసర్పంచు ఆర్‌టీ మూర్తి శనివారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు చందు, లోకనాథ నాయుడు, హేమచంద్ర నాయుడు, జాకీర్, హరిప్రసాద్‌తో పాటు పలువురు ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం



గోపీకి ఆర్థిక సహాయం చేస్తున్న గురజాల చెన్నకేశవ నాయుడు

గుడి పాల, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టువాళ్ల ఊరు అరుంధతివాడకు చెందిన టీడీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు గోపి నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని శనివారం జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు గురజాల చెన్నకేశవ నాయుడు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

గోశాలను తనిఖీ చేసిన ఈవో



రికార్డులు పరిశీలిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మే 31 (ఆంధ్ర జ్యోతి): వరసిద్ధుడి ఆలయ గోశాలను శనివారం ఈవో పెంచల కిషోర్ తనిఖీ చేశారు. గోశాలలో ఆవులకు అందించే దాణా, పచ్చిగడ్డి, ఎండుగడ్డిని పరిశీలించారు. గోవులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తగిన చికిత్సలు చేయించాలని సూచించారు. గోశాల మరింత పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవో ధనుంజయ, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

సూర్యప్రభ, శేష వాహనాలపై

వరదుడి విహారం

- నేడు గరుడసేవ



సూర్యప్రభ, శేష వాహనాలపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి

యాదమరి, మే 31 (ఆంధ్రజ్యోతి): యాదమరి త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి శనివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి శేషవాహనాలపై దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామిని మేల్కొలిపి ప్రత్యేక అలంకరణలో పూజలు, అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించారు. సూర్యప్రభ వాహనంపై ఆశీనులైన స్వామివారిని వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ మాఢవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆదిశేషువు నివాసంగా, పానుపుగా, మహావిష్ణువు అలంకరణలో కొలువుదీరి శేషవాహనంపై స్వామివారు గ్రామంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

- నేడు గరుడసేవ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గరుడసేవ, రాత్రి కల్పవృక్ష వాహనసేవలు వైభవంగా జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

సమయపాలన పాటించండి: డీసీహెచ్‌ఎస్



ప్రసూతి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ పద్మాంజలీదేవి

బంగారుపాళ్యం, మే 31 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులపట్ల ప్రేమతో మెలగాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ కె.పద్మాంజలీదేవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె తనిఖీచేశారు. గైనిక్‌వార్డు, ఓపి, ప్రసూతివార్డు, ఫార్మసీ, ల్యాబ్, ఫిజియోథెరపీ, ఐసీటీసీ, డయాలసిస్ కేంద్రాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధుల్లో వైద్యులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. కొవిడ్ కేసులు నమోదవుతున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టాయిలెట్లు శుభ్రంగా ఉంచాలని, రోగులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, బయోమెట్రిక్ కేంద్రాన్ని మిద్దెపై నుంచి కింద గదిలోకి మార్చాలని వైద్యాధికారి శిరీషాకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



గాండ్లమిట్ట కూడలిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మామిడి రైతులు

వెదురుకుప్పం, మే 31 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శనివారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో మామిడి రైతులతో కలసి జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదిక మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని, జ్యూస్ ఫ్యాక్టరీలో ఉన్న పల్పును బోర్డు కొనుగోలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంట బీమా, పురుగు మందులను ప్రభుత్వమే రాయితీపై అందించాలన్నారు. జిల్లాల్లో పండే మామిడికే ఫ్యాక్టరీ యాజమాన్యం తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తరువాత కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రమిచ్చారు. రైతులతో పాటు బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

శేష జీవితం ఆరోగ్యంగా గడపాలి



పదవీ విరమణ పొందిన అధికారులతో ఏఎస్పీ శివానంద కిశోర్

చిత్తూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న వారంతా మిగిలిన శేష జీవితాన్ని సంతోషంగా, ఆరోగ్యంతో గడపాలని ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్ ఆకాంక్షించారు. శనివారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో పదవీ విరమణ పొందిన యాదమరి ఏఎస్ఐ ఉమాపతిరెడ్డి, కోర్టు మానిటరింగ్‌సెల్ ఏఎస్ఐ భక్తవత్సలం, ఏఆర్ ఏఎస్ఐ మల్లికార్జున, గుడిపాల హెడ్‌కానిస్టేబుల్ జయరామయ్య, నింద్ర కానిస్టేబుల్ వేలాయుధం, హోంగార్డులు భాస్కర్, సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. అనంతరం పదవీ విరమణ పొందిన హోంగార్డులకు జిల్లాలోని హోంగార్డులు ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, ఏఆర్‌డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష, వన్‌టౌన్ సీఐ మహేశ్వర, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

వేయింగ్, ఈ-పోస్ మిషన్ల తనిఖీ



వేయింగ్, ఈ-పోస్ మిషన్లను తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి రాజేంద్రప్రసాద్

చిత్తూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి పాత పద్ధతిలోనే చౌకదుకాణాల్లోనే రేషన్ పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లకు పంపిణీ చేస్తున్న వేయింగ్ మిషన్, ఈ-పోస్ మిషన్లను రేషన్ పంపిణీ డీఎస్‌వో శంకర్‌తో ప్రత్యేక అధికారి లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. మిషన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అనే విషయాలను తనిఖీ చేశారు. పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిషన్లను డీలర్లకు పంపిణీ చేశారు.

టీడీపీ నేతకు పలువురి నివాళి

శ్రీరంగరాజపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బోడపాటి సుబ్రమణ్యంనాయుడు(70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే థామస్, కర్ణాటక మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జయశంకర్ నాయుడు, చిట్టిబాబు నాయుడు, రాజశేఖర్ నాయుడు, మునివర్ధన నాయుడు, వేమ నాయుడు, మాధవ నాయుడు, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

నింద్ర, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేవీకే ఆధ్వర్యంలో మండలంలోని కావునూరు నింద్ర, పాదిరి గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారిచే శనివారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో సాగు చేసే పంటలలో అధిక దిగుబడినిచ్చే రకాలు, మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాఘవేంద్ర, పశువైద్యాధికారి సాయి సౌందర్య, పశు వైద్య శాస్త్రవేత్త అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



గుడిపాల, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్.పురం, పేయన్నపల్లె గ్రామంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఏఎల్.పురంలో పురోహితులు మహేష్‌శర్మ సీతారామ కల్యాణాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. మహిళా భక్తులకు పసుపు దారాలు అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి పుష్పపల్లకీలో సీతారాముల వారిని ఊరేగించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవుల నాయుడు, సర్పంచులు గుర్రప్ప నాయుడు, సంగీత పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ



ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వీఆర్వో సురేష్

యాదమరి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాలం గ్రామానికి చెందిన లోకేష్ కిడ్నీ సమస్యలతో డయాలసిస్ నిమిత్తం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతను ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌దారుడు. విషయం తెలుసుకున్న కొటాల వీఆర్వో సురేష్‌బాబు శనివారం ఆస్పత్రికి వెళ్లి రూ.15 వేలు పింఛన్ సొమ్ము అందజేశారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదలకు పింఛన్లు

నింద్ర, మే 31(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన పేదలకు పింఛన్లు సకాలంలో అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు.

- పెనుమూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో ఉదయమే పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 7082 మందికి పింఛన్లు మంజూరు కాగా శనివారం 6692 మందికి పంపిణీ చేశారు. మిగిలిన వారికి సోమవారం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. నాయకులు కూడా పాల్గొన్నారు.
- వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పాతగుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి పంపిణీ చేశారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. వెదురుకుప్పం మండలంలో 7888 పెన్షన్లు ఉండగా 7349 మందికి పంపిణీ చేశారు. అంటే 93.17 శాతం పంపిణీ చేశారు.
- కార్వేటినగరం మండలంలో 6901 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులు ఉండగా వీరిలో 6502 మందికి గ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. అంటే 94.22 శాతం మందికి పంపిణీ చేశారు.
- పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సి.రాజేంద్రన్, నాయకులు తంగరాజ్, అరుళ్‌నాథన్, సాంబశివన్, చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు. మండలంలోని 13 పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

పొగాకు వినియోగం.. ఆరోగ్యానికి హానికరం



పొగాకు నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


నగరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొగాకు హరిస్తుందని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం డీఎస్పీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది స్థానిక టవర్ క్లాక్ నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పొగాకువాడితే వచ్చే ప్రాణాంతక వ్యాధుల గురించి ప్లకార్డులు ప్రదర్శించారు. సీఐ విక్రమ్, పోలీసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- నింద్ర (ఆంధ్రజ్యోతి): మండల వైద్యాధికారులు సుమలత, వినిషా ఆధ్వర్యంలో నింద్రలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వలన జరిగే ప్రమాదాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ గోపి, సీహెచ్‌వో శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.
- పాలసముద్రం (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగలో డాక్టర్ మోహనకృష్ణ ప్రజలకు పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వలన కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- గుడిపాల (ఆంధ్రజ్యోతి): గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి బాలసూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది వెంకటేశ్, సెల్వి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.
- వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది ప్లకార్డులను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకులు త్యాగు, సీహెచ్‌వో రాజేశ్వరి, పీహెచ్‌ఎన్ గౌరీ పాల్గొన్నారు.

ఐరాలకు చేరుకున్న వేరుశనగ విత్తన కాయలు

ఐరాల, మే 31(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని అన్ని ఆర్ఎస్కేలకు వేరుశనగ విత్తన కాయలు శనివారం చేరాయి. మండల వ్యాప్తంగా ఉన్న ఆర్ఎస్కేలకు గాను 1100 క్వింటాళ్ల కె.6 విత్తన కాయలు వచ్చినట్లు ఏవో వరలక్ష్మి తెలిపారు. విత్తన కాయల బస్తా ధర రూ.1674 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. అవసరమైన రైతులు వారివారి ఆర్ఎస్కేల వద్దకు వెళ్లి కొనుగోలు చేసుకోవచ్చునని ఏవో తెలిపారు.

ఘనంగా చిత్రా పౌర్ణమి పూజలు



విశేష అలంకరణలో ఓంశక్తి అమ్మవారు

నగరి, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో చిత్రా పౌర్ణమి పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఎరుపు రంగు చీరలు ధరించిన 108 మంది మహిళలు దీపపు పూజలు చేశారు. పసుపుతో అమ్మవారిని చేసి, 1008 పుష్పాలతో పుష్పార్చన చేసిన అనంతరం వేపాకు, పసుపు, కుంకుమలతో అర్చనలు చేశారు. ఆలయ నిర్వాహకులు, ఉభయదారులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

బోల్తా పడిన లారీ.... తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

గుడిపాల, మే 31(ఆంధ్రజ్యోతి): వేలూరు-చిత్తూరు జాతీయ రహదారిలో 190 రామాపురం సీఎంసీ వద్ద శనివారం ఉదయం ఓ లారీ బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన గోపాలకృష్ణ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు తెలిపారు. ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.